క్లుప్తంగా

ముమ్మిడివరం ఎంపీడీఓగా వెంకటాచార్యులు


తాడి వెంకటాచార్యులు

ముమ్మిడివరం: ముమ్మిడివరం ఎంపీడీఓగా తాడి వెంకటాచార్యులు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో అయినవిల్లి ఎంపీడీఓగా పనిచేస్తూ ఇక్కడకు బదిలీపై వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన వెంకటాచార్యులను పలువురు నాయకులు, కార్యాలయ సిబ్బంది అభినందించారు.

కొనసాగుతున్న ఎల్ఐసీ ఏజెంట్ల ఆందోళన

అమలాపురం టౌన్: తమ డిమాండ్ల సాధన కోసం అమలాపురం ఎల్ఐసీ బ్రాంచి ఎదుట ఆ సంస్థ ఏజెంట్ల నిరసన కార్యక్రమం రెండో రోజు మంగళవారం కూడా కొనసాగింది. ఎల్ఐసీ అవలంబిస్తున్న ద్వంద్వ వైఖరి విధానాలతో సామాన్యులకు అందుబాటులో లేని పాలసీలను పెట్టారని అమలాపురం ఎల్ఐసీ ఏజెంట్ల యూనియన్ అధ్యక్షుడు సుందరనీడి శ్రీనివాసరావు ధ్వజమెత్తారు. ఈ అసంబద్ధ విధానాల పట్ల పాలసీదారులే కాకుండా ఏజెంట్లు కూడా ఇబ్బంది పడే పరిస్థితిని ఎస్ఐసీ కల్పించిందని ఏజెంట్ల డివిజన్ యూనియన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ రావూరి ఉదయ భాస్కర్ పేర్కొన్నారు. ఎల్ఐసీ బ్రాంచి కార్యాలయం ఎదుట ధర్నా చేసి తమ నిరసన తెలియజేశారు. ఈ నిరసనలో రాజమహేంద్రవరం డివిజన్ యూనియన్ ఉపాధ్యక్షుడు పోలిశెట్టి బ్రహ్మయ్య, అమలాపురం కార్యదర్శి ఎస్.శ్యామ్‌బాబు, విత్తనాల రాంబాబు, సాపే వెంకటేశ్వర్లు, సూరవరపు త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరుని కల్యాణోత్సవం


స్వామివారికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు తీసుకువస్తున్న అధికారులు

యానాం: యానాంలో కొలువైన శ్రీ భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం నిర్వహించిన స్వామివారి కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామివారికి సువర్ణ పుష్పార్చన, ముత్యాల హారతి, సహస్రనామార్చన గావించారు. స్వామివారికి ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలను ప్రభుత్వం తరపున బహూకరించారు. శ్రీవైఖానస ఆగమ విద్వాన్ వాడపల్లి గోపాలాచార్యుల పర్యవేక్షణలో స్వామివారి కల్యాణం జరిగింది.

మానసిక ఆరోగ్యంపై అవగాహన సదస్సు

యానాం: ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం యానాం జవహర్ నవోదయ విద్యాలయంలో వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్జనలో విద్యార్థులపై ఎటువంటి ఒత్తిడి పడకుండా వారి మానసిక ఆరోగ్యం కోసం వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు మానసిక ఆరోగ్య సదస్సులో ప్రిన్సిపాల్ సి రాజశేఖరరెడ్డి పేర్కొన్నారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా విచ్చేసిన మానసిక వైద్యనిపుణులు డాక్టర్ సుకీర్తి, వైద్యులు డాక్టర్ కమిడి కిషోర్‌లు విద్యార్థులు మానసిక సమస్యలను ఏవిధంగా ఎదుర్కోవాలో సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో నవోదయ విద్యాలయ కౌన్సిలర్ కె విజయసురేష్ , ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా భేతాళ స్వామి కలశ స్థాపన

అమలాపురం టౌన్: అమలాపురం కొంకాపల్లి దసరా ఉత్సవాలకు, చెడీ తాలింఖానాకు 189 ఏళ్ల చరిత్ర ఉంది. ఈనెల 12న జరిగే దసరా ఉత్సవాల ఊరేగింపు, చెడీ తాలింఖానా ప్రదర్శనలకు సంబంధించి ఆరాధ్య దైవమైన భేతాళస్వామి కలశ స్థాపన కొంకాపల్లిలో మంగళవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. కలశ స్థాపనతో పాటు అఖండ జ్యోతి, కంకణ ధారణ ముహూర్త కార్యక్రమాలను నిష్టగా నిర్వహించారు. దసరా ఉత్సవాలకు అయిదు రోజుల ముందు కన్నె కుర్రాడిని భేతాళ స్వామికి నియమించి ఆ కుర్రాడి చేత కలశ పూజ చేయించడం సంప్రదాయం. కొంకాపల్లి భేతాళస్వామి ఆలయంలో ఆ కుర్రాడు అయిదురోజులు నిష్టగా ఉపవాసం చేస్తాడు. దసరా రోజున కుర్రాడిని జమ్మి చెట్టు వద్దకు తీసుకుని వెళ్లి జమ్మి కొట్టించి ఉత్సవాలకు, ప్రదర్శనలకు శ్రీకారం చుట్టడం ఆనవాయితీ.

వేంకటేశ్వరునికి 108 గంగాళాలు బహూకరణ

తాళ్లరేవు: వాసవీక్లబ్ కపుల్స్ ఆధ్వర్యంలో తాళ్లరేవు ప్రధాన రహదారిలో వేంచేసి యున్న శ్రీ వేంకటేశ్వరస్వామి వారికి మంగళవారం 108 వెండి గంగాళాలు బహూకరించారు. మండలంలో పర్యటించిన క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు ఆర్.రవిచంద్రన్ చేతులమీదుగా వీటిని ఆలయ ప్రధాన అర్చకులు ఖండవిల్లి కేశవాచార్యులకు అందజేశారు. వాసవీమాత ఆలయ ప్రాంగణంలో నిర్మించిన ఆఫీస్‌రూమ్‌ను ప్రారంభించారు. పత్తిగొందిలో రామాలయ ప్రాంగణంలో టైల్స్‌ను ప్రారంభించారు. ఇంజరం సాయిబాబా మందిరంలో వెండి కడియాన్ని అందజేశారు. క్లబ్ ప్రెసిడెంట్ అద్దేపల్లి సుధ, కార్యదర్శి భారతి, కోశాధికారి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఎండాకు తెగులు.. అన్నదాతకు దిగులు..

- దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆవేదన
- అప్పుల ఊబిలో రైతన్నలు

ఆరుగాలం శ్రమించే అన్నదాతకు ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ చుక్కలు చూపించింది. వంట ఏపుగా పెరిగిన సమయంలో సుడిదోమ, ఎండాకు తెగులు సోకి దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. దిగుబడులు మాట ఎలా ఉన్నా ఇప్పటివరకు ఖర్చులు తడిసి మోపెడయ్యాయి. ఎకరాకు పెట్టుబడి రూ.15 వేలు వరకు పెట్టి కంటికి రెప్పలా కాపాడుకున్న పంట తెగుళ్ల బారిన పడుతోంది. ఎన్ని క్రిమిసంహారక మందులు వాడినా తెగులు ఉధృతి తగ్గక పోవడంతో ఏం చేయాలో తెలియని పరిస్థితిలో రైతన్నలు నిర్వేదానికి గురవుతున్నారు.

ముమ్మిడివరం: నియోజకవర్గంలో పలువురు రైతులు ఎండాకు తెగులు బారిన పడి నష్టపోతున్నారు. ఎంటీయూ 1318 విత్తనాలను కొనుగోలు చేశారు. గత సీజన్‌లో వీటిని విత్తన సాగు చేసి ఖరీఫ్‌లో ఈ రకం వరిని వేశారు. ఇలా నియోజకవర్గంలో 5 వేల ఎకరాల వరకు ఈ రకమైన వరిలో ఏపుగా పెరిగి గింజలు పాలు పోసుకొనే దశలో ఎండాకు(బాక్టీరియా) తెగులు ఆశించి పైరు ఎండిపోతోంది. గింజలు చచ్చుబడి పాల్లు మాదిరిగా తయారైంది. సాధారణంగా తెగులు ఆశించిన చేలు అక్కడక్కడా దెబ్బతింటుంది కాని ఎండాకు తెగులు ఆశించిన చేలు మొత్తం ఎండిపోయి పంట అంతా మాడి పోయే ప్రమాద ముందని రైతులు వాపోతున్నారు.


తెగులు ఆశించిన వరి దుబ్బు


గాడిలంకలో ఎండాకు తెగులు ఆశించి ఎండిపోతున్న వరిచేలు

అప్పుచేసి పంట సాగు చేశా..



అప్పులు చేసి పంట సాగు చేశా. సొంత భూమి 4 ఎకరాలతో పాటు మరో 10 ఎకరాలు కౌలుకు సాగు చేశాను. ఎంటీయూ 1318 విత్తనాలను మొత్తం సాగు చేశాను. ఏపుగా పెరిగి గింజలు పాలు పోసుకొనే దశలో దుబ్బులు ఎండిపోవడం గమనించాను. వ్యవసాయాధికారులకు విన్నవించాను. అధికారులు వచ్చి చూశారు. వాతావరణంలో మార్పువల్ల (బ్యాక్టీరియా) ఈ తెగులు వచ్చిందన్నారు. ఎటువంటి క్రిమి సంహారక మందులు పిచికారీ చేయాలో సూచించారు. పురుగు మందులకు ఎకరాకు సుమారు రూ.2 వేలు వరకు ఖర్చు చేశాను.

– కొమ్మిరెడ్డి శ్రీనివాసరావు, రైతు, గాడిలంక.

యాజమాన్య పద్ధతులు అవలంబించాలి



అధిక వర్షాల వల్ల ఎంటీయూ 1318, సంపద, స్వర్ణ వంటి రకాలలో ఈ తెగులు ఎక్కువగా వ్యాప్తి చెందుతుంది. నత్రజని ఎక్కువగా వాడటం వల్ల ఈ తెగులు వృద్ధి చెందుతుంది. దీని నివారణకు లీటరు నీటికి 1 గ్రాము స్ట్రెప్టోమైసిన్ సల్ఫేట్ లేదా టెట్రా సైక్లిన్ హైడ్రో క్లోరైడ్(ప్లాంటామైసిన్), 3 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా 2 గ్రాముల కాపర్ హైడ్రాక్సైడ్, 53.8 డీఎఫ్(కోసైడ్)కలిపి పిచికారీ చేయడం వల్ల కొంత మేర తెగులు వ్యాప్తిని అరికట్టవచ్చు.

– ఎస్. ప్రశాంతకుమార్, ఏఓ, ముమ్మిడివరం.

విజయ ఫిర్యాదులో నిజం లేదు

- అమలాపురం విద్యుత్‌శాఖ ఈఈ మోకా రవికుమార్

అమలాపురం రూరల్: కాట్రేనికోన మండలం కందికుప్ప గ్రామంలో బొజ్జా విజయకు చెందిన వ్యవసాయ భూములకు సంబంధించి పట్టాదారు పాసు పుస్తకాలు రాకుండా విద్యుత్‌శాఖ ఈఈ మోకా రవికుమార్ కుటుంబ సభ్యులు అడ్డుకుంటున్నారని బొజ్జా విజయ చేసిన ఫిర్యాదులో ఎంత మాత్రం నిజం లేదని అమలాపురం విద్యుత్‌శాఖ ఈఈ మోకా రవికుమార్ ఒక ప్రకటనలో వివరణ ఇచ్చారు. ఆమెకు చెందిన భూముల సర్వే నెంబర్లు తన భార్య శిరీష, అన్న శ్రీనివాస్, ఇతర కుటుంబ సభ్యులు పాస్ పుస్తకాల్లో నమోదు చేయించుకోవడం వల్ల పాస్ బుక్ లు రాకుండా రెవెన్యూ సిబ్బందిని అడ్డుకుంటున్నాననే ఆరోపణలలో ఎంతమాత్రం నిజంలేదన్నారు. విజయకు పాస్ బుక్ రాకపోవడం అనేది రెవెన్యూ సిబ్బందికి సంబంధించిన అంశమని అందులో తన ప్రమేయం గానీ, తన కుటుంబ సభ్యుల ప్రమేయం గానీ ఎంత మాత్రం లేదన్నారు.

సమస్యల పరిష్కారం కోసమే

అమలాపురం రూరల్: ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. అమలాపురం మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి అధ్యక్షతన మంగళవారం ఎమ్మెల్యే ప్రజా పరిష్కార వేదిక నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల సమస్యలకు నేరుగా పరిష్కార మార్గం చూపేందుకు ఈ వేదికను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అలరిస్తున్న పౌరాణిక, సాంఘిక నాటికలు

- రంగ స్థల కళాకారులను ప్రోత్సహిస్తున్న శ్రీదేవి ఉత్సవ కమిటీ
- కోనసీమ వ్యాప్తంగా తరలి వస్తున్న రంగస్థల అభిమానులు


అమలాపురం దసరా ఉత్సవాల వేదికపై ప్రదర్శితమవుతున్న పౌరాణిక నాటకంలోని ఓ ఘట్టం


కళాకారుల ఫొటోలతో ముద్రితమైన శ్రీదేవి ఆలయ దసరా ఉత్సవాల భారీ ఆహ్వాన పత్రం

అమలాపురం టౌన్: శరన్నవరాత్ర ఉత్సవాలను వైభవంగా నిర్వహించే అమలాపురం శ్రీదేవి ఉత్సవ కమిటీ గత 45 ఏళ్లుగా రంగస్థల కళాకారులను ఆదరిస్తూనే పౌరాణిక, సాంఘిక నాటకాలు, నాటికలను ఆదరిస్తోంది. ప్రతి విజయ దశమి ఉత్సవాలకు స్థానిక శ్రీదేవి మార్కెట్‌లోని శ్రీదేవి అమ్మవారి ఆలయం వద్ద రంగ స్థల ప్రదర్శనల కోసం ఉత్సవ కమిటీ భారీ స్టేజిని నిర్మిండచం ఆనవాయితీగా వస్తోంది. ప్రతీ ఏటా శరన్నవ రాత్ర ఉత్సవాలకు రంగస్థల నాటికలు, నాటకాలు ప్రదర్శించడం ద్వారా ఉత్సవ కమిటీ దాదాపు 300 మంది కళాకారులను ప్రోత్సహించి తన వంతు ఆదరిస్తోంది. ఈ ఉత్సవ కమిటీ దసరా నిర్వహణలో అన్నింటిలోనూ ఆదర్శంగా ఉండడమే కాక ఓ ప్రత్యేకతను చాటుతుంది. ఈ ఉత్సవాల ఆహ్వాన పత్రాన్ని నాలుగు అడుగుల వెడల్పు, మూడున్నర అడుగుల పొడవుతో ముద్రించి కోనసీమ వ్యాప్తంగా పలువురికి పంపిణీ చేస్తోంది.

దసరా ఉత్సవాల తొమ్మిది రోజులూ రాత్రి సమయంలో రంగ స్థల నాటకమో, నాటికో ప్రదర్శితమవుతుంది. తొమ్మిది రోజులూ నవరసాల మాదిరిగా అన్ని రకాలు అంటే సినీ సంగీత విభావరులు, జాన పద గీతాల ప్రదర్శనలు వంటి వినోద కార్యక్రమాలతో పాటు పౌరాణిక, సాంఘిక నాటకాలు, నాటికలను ప్రదర్శిస్తోంది. దీనికితోడు భారీ ఊరేగింపు పేరుతో అమ్మవారి నిమజ్జనం రోజును రూ. లక్షల వ్యయంతో 16 రకాల సాంస్కృతిక ప్రదర్శనలను దాదాపు 250 మంది కళాకారుతో నిర్వహిస్తుంది. ఈ నెల 16న భారీ ఊరేగింపు నిర్వహణకు సన్నహాలు చేస్తోంది.

రంగస్థల వినోదాన్ని పంచాలనే లక్ష్యంతోనే..

అంతరించిపోతున్న రంగ స్థలాన్ని కాపాడుకునేందుకు ప్రతీ ఏటా దసరా ఉత్సవాల్లో పౌరాణిక, సాంఘిక నాటకాలు, నాటికల ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నాం. రూ.లక్షల వ్యయమైనా కళాకారులను ప్రోత్సహించాలన్న ఒకే ఒక లక్ష్యంతో మా ఉత్సవ కమిటీ ఈ వినోద కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఉన్న కొద్దిపాటి రంగ స్థల అభిమానులకు వినోదాన్ని పంచాలని, మిగిలిన ప్రేక్షకులకు సాంఘిక, ఇతర ప్రదర్శనలు సైతం జోడించి తొమ్మిది రాత్రులూ వినోదాన్ని అందించడం ఆనవాయితీగా పెట్టుకున్నాం.

– గంగాబత్తుల రాంబాబు, చైర్మన్, శ్రీదేవి ఉత్సవ కమిటీ, అమలాపురం

రాగాలతో మైమరచే పౌరాణిక ప్రియులు..

కళా సమితులు, కళా మండళ్ల పేరుతో రంగస్థల నాటికలు ప్రదర్శించే పౌరాణిక కళాకారులుకు ఈ ఆధునిక కాలంలో క్రమేపీ ఆదరణ, ప్రోత్సాహం కరవవుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో రాష్ట్రంలో పౌరాణిక, సాంఘిక రంగ స్థలాన్ని ఆదరించే కొన్ని నగరాలు, పట్టణాలు, గ్రామాల్లో ఉన్న అతి కొద్ది ఉత్సవ కమిటీల్లో అమలాపురం శ్రీదేవి ఉత్సవ కమిటీ ఒకటి. కోనసీమ వ్యాప్తంగా ఉన్న కొంత మంది రంగ స్థల ప్రియులు శ్రీదేవి ఉత్సవ కమిటీ ఏర్పాటు చేసే పౌరాణిక, సాంఘిక ప్రదర్శనలకు పనిగట్టుకుని వచ్చి రాత్రంతా వాటిని తిలకిస్తారు. ముఖ్యంగా పౌరాణిక నాటకాల్లో నటీనటులు ఆలపించే రాగ యుక్త పద్యాలను మైమరిచి వింటారు. ఈ పౌరాణిక నాటకాలు చూసేందుకు, వినేందుకు ఏడాదంతా ఎదురు చూస్తారు. జంబో ఆహ్వాన పత్రంలో ఏఏ తేదీల్లో ఏఏ ప్రదర్శనలు ఉంటాయో వివరిస్తూనే ఆయా ప్రదర్శనల కళాకారుల ఫొటోలు కూడా ముద్రించి మరీ ఆహ్వానించడం శ్రీదేవి ఉత్సవ కమిటీ ఆనవాయితీ. ఈ దసరాకు సత్య హరిశ్చంద్ర, బాల నాగమ్మ, గయోపాఖ్యానం, శ్రీకృష్ణ తులాభారం, శ్రీరామాంజనేయ యుద్ధం, కురుక్షేత్రం వంటి పౌరాణిక నాటకాలు, నాటికలే కాకుండా చింతామణి వంటి నాటకాలు ప్రదర్శిమవుతున్నాయి. ఇవి కాకుండా కోలాటాలు, బుర్రకథలు, హరికథలు, ఆర్కెస్ట్రాలు, కూచిపూడి నృత్య ప్రదర్శనలు వంటి సాంస్కృతిక ప్రదర్శనలు కూడా ఏర్పాటు చేశారు. అందుకే ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని రంగస్థల నటీనటులకు, కళాకారులకు శ్రీదేవి ఉత్సవ కమిటీ అంటే ఎనలేని అభిమానం

ఆకట్టుకున్న చిన్నారుల నృత్య ప్రదర్శన


వేదికపై నృత్య ప్రదర్శన చేస్తున్న సుస్మిత, నమ్రత

అమలాపురం టౌన్: విజయ దశమి శరన్నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా స్థానిక గోఖలే సెంటరులోని కనకదుర్గ ఆలయం చలువ పందిరిలో చిన్నారి నృత్య కళాకారిణుల నృత్య ప్రదర్శన సోమవారం రాత్రి అందరినీ ఆకట్టుకుంది. పట్టణానికి చెందిన ఆదుర్తి లక్ష్మీ సుస్మిత, గుబ్బల సాయి నమ్రత, సాయి దిషితలు ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆద్యంతం రంజింపజేసింది. ముందుగా సుస్మిత, నమ్రత 'వినాయక కౌతం' పై నృత్య ప్రదర్శన చేశారు. తర్వాత సుస్మిత ×అన్నమాచార్య కీర్తనలు, రామాయణ శబ్దం, కృష్ణ శబ్దం, అఖిలండేశ్వరి తదితర కూచిపూడి అంశాలను ప్రదర్శించింది. ఆరు సంవత్సరాల దిషిత బుడిబుడి అడుగులతో పలు కూచిపూడి నృత్యాలను ప్రదర్శించింది. మరో చిన్నారి తేజస్వి 13 ఆధునిక పాటలను మిక్సింగ్ చేసి ఒకే పాటగా స్టెప్పులు వేసి అలరించింది. ప్రదర్శనల అనంతరం చిన్నారులకు దుర్గా ఉత్సవ కమిటీ ప్రతినిధులు జ్ఞాపికలు అందజేసి సత్కరించి అభినందించారు.

విద్యార్థులు ఓటు నమోదు చేసుకోవాలి


ఆర్డీవో మాధవికి ఓటరు నమోదు పత్రాలను అందజేస్తున్న విద్యార్థులు

- ఆర్డీవో మాధవి

అమలాపురం రూరల్: కళాశాలలో విద్యార్థులు ఓటు నమోదు చేయించుకోవాలని ఆర్డీవో మాధవి సూచించారు. భట్లపాలెం బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలలో ఓటరు నమోదు కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆర్డీవో మాట్లాడుతూ విద్యార్థులు ఓటు హక్కు పొందాలని సూచించారు. విద్యార్థులకు ఓటు యొక్క ప్రాముఖ్యతను దాని ఆవశ్యకతను వివరించారు. ముందుగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె వీజీ రామారావు మాట్లాడుతూ బీవీసీ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులు ఓటు నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. తహసీల్దార్ సునీల్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు ఓటు హక్కు వినియోగించుకొని వారి భవిష్యత్తును అభివృద్ధి వైపు నడిపించుకోవాలన్నారు. ఆర్డీవో మాధవికి విద్యార్థులు ఓటరు నమోదు పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజు, వైఎస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంఎస్ మదన్ ఏఓ కృష్ణారావు పాల్గొన్నారు.

ఊరేగింపులు ప్రశాంతంగా నిర్వహించుకుందాం


సమావేశంలో సూచనలు ఇస్తున్న డీఎస్పీ ప్రసాద్

అమలాపురం టౌన్: దసరా ఉత్సవాలు, ఊరేగింపులు, చెడీ తాలింఖానా ప్రదర్శనలకు పెట్టింది పేరు అమలాపురం . అలాంటి ఖ్యాతి ఉన్న పట్టణంలో ఈనెల 12న జరిగే ఊరేగింపులను ప్రశాంతంగా నిర్వహించుకునేందుకు అందరూ సహకరించాలని డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్ ఉత్సవ కమిటీల ప్రతినిధులకు విజ్ఞప్తి చేశారు. స్థానిక గ్రాండ్ పార్కు హోటల్ సమావేశ మందిరంలో దసరా ఊరేగింపులను నిర్వహించే ఏడు వీధుల ఉత్సవ కమిటీ ప్రతినిధులతో మంగళవారం రాత్రి పోలీసులు నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో డీఎస్పీ ప్రసాద్ మాట్లాడారు. పట్టణ సీఐ పి.వీరబాబు, పట్టణ ఎస్సై కిషోర్‌బాబు ప్రసంగిస్తూ ఈనెల 12న పట్టణంలో 7 వీధుల మేళవింపుతో సాగే ఊరేగింపులకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అనుచరించాల్సిన నియమ నిబంధనలను ఉత్సవ కమిటీల ప్రతినిధులకు వివరించారు.

ఆటోబోల్తా.. డ్రైవర్ మృతి

తాళ్లరేవు: జాతీయ రహదారి 216లోని చొల్లంగి గొడౌన్స్ సమీపంలో ఆటో అదుపు తప్పి బోల్తా పడడంతో డ్రైవర్ ర్యాలి సత్తిరాజు(42) మృతి చెందాడు. కోరంగి ఎస్సై పి.సత్యన్నారాయణ కథనం మేరకు అయినవిల్లి మండలం కొండుకుదురు గ్రామానికి చెందిన ర్యాలి సత్తిరాజు కొబ్బరికాయల లోడుతో కాకినాడ వెళుతుండగా ఆటో అదుపుతప్పి ప్రక్కనే ఉన్న ఊటబోదెలో బోల్తా పడింది. ఆటో కింద చిక్కుకుపోయిన సత్తిరాజు అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సత్యన్నారాయణ తెలిపారు.

యానాంకు పుదుచ్చేరి ఉన్నతాధికారులు

- నవంబర్‌లో ఎల్జీ కైలాష్‌నాథన్ పర్యటన
- ఎమ్మెల్యే అశోక్ వెల్లడి

యానాం: పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ ఆదేశాల మేరకు యానాంలో ఉన్న వివిధ సమస్యలపై ప్రజల నుంచి వినతుల స్వీకరణకై వివిధ శాఖల ఉన్నతాధికారులు, కార్యదర్శులు యానాం విచ్చేయనున్నారని మంగళవారం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ తెలిపారు. తాను గత శనివారం ఎల్జీ కైలాష్‌నాథన్‌ను రాజ్‌నివాస్‌లో కలిసినప్పుడు తాను చేసిన విజ్ఞప్తి మేరకు అధికారులు వస్తున్నారన్నారు. ముఖ్యంగా విద్యుత్‌శాఖకు సంబంధించి సమస్యలను తెలుసుకోవడం కోసం బుధవారం సూపరింటెండెంట్ ఇంజినీరు వస్తున్నారని ఈ సందర్భంగా దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యల గూర్చి ప్రజలనుంచి వినతులు స్వీకరిస్తారన్నారు. ప్రజలు సైతం తాము ఎదుర్కొంటున్న సమస్యలను రాతపూర్వకంగా అధికారులు దృష్టికి తీసుకురావాలని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మహాలక్ష్మీదేవిగా అమ్మవార్ల దర్శనం

అమలాపురం టౌన్: శరన్నవ రాత్రి మహోత్సవాలలో భాగంగా ఆరో రోజు మంగళవారం పటణంలోని పలు అమ్మవారి ఆలయాల్లో అమ్మవార్లు మహాలక్ష్మీదేవిగా అలంకృతమై భక్తులకు దర్శనిమచ్చారు. అమలాపురం శ్రీదేవి అమ్మవారి ఆలయంలో గణేష్ కిరాణా మర్చంట్స్ కుప్పాల సోదరులు ఆర్థిక సహకారంతో నిర్వహించిన భారీ అన్న సమారాధనలో వేలాది మంది భక్తులు అమ్మవారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. శ్రీదేవి ఉత్సవ కమిటీ చైర్మన్ గంగాబత్తుల రాంబాబు ఆధ్వర్యంలో అమ్మవారి సన్నిధిలో పలు హోమాలు జరిగాయి. శ్రీదేవి ఆలయం, వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో గల వైష్ణవీ కనకదుర్గ ఆలయం , సావరం బైపాస్‌లోని కనకదుర్గ ఆలయం, హౌసింగ్ బోర్డు కాలనీలోని కల్యాణ దుర్గ ఆలయం, గోల్డ్ మార్కెట్‌లోని కామాక్షీ ఏకాంబరేశ్వరీదేవి ఆలయం, కన్యకా పరమేశ్వరి దేవీ ఆలయంలో అమ్మవార్లు మహాలక్ష్మీదేవిగా అలంకృతమై భక్తులకు దర్శనమిచ్చారు. కామాక్షీ ఏకాంబరేశ్వరీదేవి ఆలయం వద్ద పట్టణ విశ్వ బ్రాహ్మణ, స్వర్ణకార సంఘాల ఆధ్వర్యంలో శరన్నవ రాత్ర మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి.


మహాలక్ష్మీదేవిగా వైష్ణవీ కనకదుర్గ అమ్మవారు


మహాలక్ష్మీదేవిగా దర్శనమిస్తున్న శ్రీదేవి అమ్మవారు

కామాక్షి ఆలయంలో పూజలు

అమలాపురం టౌన్: అమలాపురం పట్టణ విశ్వ బ్రాహ్మణ, స్వర్ణకారుల సంఘాల ఆధ్వర్యంలో స్థానిక గోల్డ్ మార్కెట్ వద్ద గల శ్రీ కామాక్షీ ఏకాంబరేశ్వరీదేవి ఆలయంలో శరన్నవ రాత్రి మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా వందలాది మంది మహిళలతో అమ్మవారి సమక్షంలో సామూహిక కుంకుమ పూజలు మంగళవారం వైభవంగా జరిగాయి. అమ్మవారు మహాలక్ష్మీదేవిగా అలంకృతమై భక్తులకు దర్శనమిచ్చారు. పట్టణ స్వర్ణకారుల సంఘం అధ్యక్షుడు భరణికాన బాబు, కార్యదర్శి ఓడూరి ఫణి, కోశాధికారి చింతా నాని తదితరుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి.

మహాలక్ష్మీదేవిగా అమ్మవారు

ముమ్మిడివరం: దశమి శరన్నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా ఆరవ రోజు మంగళవారం అమ్మవారు మహాలక్ష్మీ దేవిగా భక్తులకు దర్శన మిచ్చారు. మండలంలో గోదశివారి పాలెంలో అమ్మవారిని రూ. 25 లక్షలు, పళ్లవారి పాలెంలో అమ్మవారిని రూ.5లక్షల కరెన్సీ నోట్లతో మహాలక్ష్మీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ముమ్మిడివరం విజయదర్గమ్మ ఆలయం వద్ద భవానీ మాల దారులచే అమ్మవారికి పంచ హారతులు, నిప్పుల గుండం కార్యక్రమం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. చినకొత్తలంక, లక్ష్మీదేవిలంక, ఠానేల్లంక, అయినాపురంతో పాటు పలు గ్రామాలలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.

కనదుర్గ సన్నిధిలో లక్ష కుంకుమార్చనలు

యానాం: నియోజకవర్గ శివారు దొమ్మేటిపేట గ్రామంలో కొలువైన శ్రీకనకదుర్గమ్మ వారి ఆలయంలో విజయదశమిని పురస్కరించుకుని మంగళవారం ఆరవరోజు ఆలయ అర్చకులు రాయప్రోలు కిరణ్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. యానాం పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు సతీమణి ఉదయలక్ష్మి పాల్గొని పూజలు నిర్వహించారు.

అహోరాత్ర లలితా పారాయణ ప్రారంభం

ఐ.పోలవరం: శ్రీ చక్ర అధిష్టాన దేవత శ్రీ లలితా అమ్మవారి ద్వితీయ అహోరాత్ర లలితా సహస్రనామ పారాయణ మంగళవారం శ్రీ వీరేశ్వర స్వామి వారి ఆలయంలో వైభవోపేతంగా ప్రారంభమయ్యింది. హిందూ ధర్మ పథం శరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా ఆలయ అర్చకులు బ్రహ్మశ్రీ యనమండ్ర సుబ్బారావు, బ్రహ్మశ్రీ పేటేటి శ్యామల కుమార్, పురోహితులు బ్రహ్మశ్రీ నాగాభట్ల రామకృష్ణ మూర్తి ఆధ్వర్యంలో కలశ స్థాపన, ఇత్యాది పూజా కార్యక్రమాలు జరిపి ప్రారంభించారు.

పాల కనకదుర్గమ్మ ఆలయంలో గోపూజ


గ్రాంటు గ్రామంలోని పాల కనకదుర్గమ్మ ఆలయంలో గోపూజ చేస్తున్న భక్తులు

తాళ్లరేవు: శరన్నవరాత్ర మహోత్సవాలలో భాగంగా ఆరవరోజైన మంగళవారం అమ్మవారిని మహాలక్ష్మీదేవిగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. పి.మల్లవరం పంచాయతీ గ్రాంటు గ్రామంలో వేంచేసియున్న శ్రీ పాల కనకదుర్గమ్మ ఆలయంలో అర్చకులు రాయప్రోలు కామేశ్వర శర్మ ఆధ్వర్యంలో గోపూజ, కాత్యాయినీ పూజలను భక్తి శ్రద్ధలతో జరిపించారు. కోరంగి శ్రీ దుర్గా మల్లేశ్వర శక్తి పంచాయతన అమ్మవారి ఆలయంలో అమ్మవారిని మహాలక్ష్మీదేవి అలంకరణలో పూజలు చేశారు. నీలపల్లిలో ప్రముఖ ఆధ్యాత్మికవేత్త కంచర్ల వెంకట నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పంచమ నవచండీ సహిత శరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా అమ్మవారిని మహాలక్ష్మీదేవిగా అలంకరించి పూజలు చేశారు. పంచామృతాలతో అభిషేకించారు. ఇంజరం హరశ్రీ నిలయంలో అర్చకులు కాకరపర్తి బాబీశర్మ ఆధ్వర్యంలో అమ్మవారిని మహాలక్ష్మీదేవిగా అలంకరణ చేశారు. రూ.2 లక్షల కరెన్సీ నోట్లతో ఆలయాన్ని అలంకరించారు. పాత కోరంగి శ్రీ బాలాత్రిపుర సుందరీ సమేత శ్రీ కురంగేశ్వర స్వామి వారి ఆలయంలో అర్చకులు కెఆర్‌కె సాయిప్రసాద్ మహిళలచే సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. తాళ్లరేవు పరదేశమ్మ వీధిలో వేంచేసియున్న కనకదుర్గ ఆలయంలో అమ్మవారిని కరెన్సీనోట్లతో అలంకరించి పూజలు చేశారు.

ఫేక్ సర్టిఫికెట్ల ఉద్యోగులపై చర్యలకు వినతి

యానాం: యానాం నియోజకవర్గ పరిధిలో ఉన్న వివిధ సమస్యలకు సంబంధించి హోమ్‌మంత్రి నమశ్శివాయంకు మంగళవారం వినతిపత్రం అందించినట్లు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ తెలిపారు. ఈ మేరకు పుదుచ్చేరిలో హోమ్‌మంత్రి నమశ్శివాయంతో వివిధ సమస్యలపై చర్చించినట్లు తెలిపారు. ముఖ్యంగా విద్యాశాఖలో పనిచేస్తున్న పారాటీచర్లుకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని కోరినట్లు తెలిపారు. గతంలో వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో ఫేక్ సర్టిఫికెట్లుతో టీచర్, నర్సులు తదితర శాఖల్లో ఉద్యోగాలు చేస్తున్నవారి వివరాలు కేంద్రహోమ్‌శాఖకు, పుదుచ్చేరి ప్రభుత్వానికి అందించినట్లు దీనిపై నిజనిర్ధారణ కమిటీ వేసేలా కోరినట్లు దానికి ఆయన సానుకూలత వ్యక్తం చేశారన్నారు.

విద్యుదాఘాతంతో తాటాకిల్లు దగ్ధం

ఉప్పలగుప్తం: మండలంలోని చినగాడవిల్లి గ్రామ పంచాయతీలో దూనబోయిన ప్రభాకరరావుకు చెందిన తాటాకిల్లు సోమవారం రాత్రి వేళలో విద్యుదాఘాతానికి గురై పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటనలో సుమారు రూ.6 లక్షలు ఆస్తినష్టం సంభవించిందని రెవెన్యూ సిబ్బంది తెలిపారు. ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు మంగళవారం సంఘటనా స్థలాన్ని పరిశీలించి బాధితులకు నిత్యావసరాలు అందజేశారు.